సాక్షి
అన్నమయ్య జిల్లా
సోమవారం । 13 । మార్చి । 2023



గంగమ్మా..దీవించమ్మా..
చింతకొమ్మదిన్నె మండలం బుగ్గలేటిపల్లి సమీపంలో వెలసిన గంగమ్మ జాతరకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. -8లో..



రాజంపేట.. గుత్తోళ్లకు 'బాట'!
రాజంపేటకు గుత్తి పరిసరాల ప్రాంతాల నుంచి కూలీలు వలస వస్తున్నారు. ఈ ప్రాంతంతో విడదీయరాని బంధం ఏర్పరుచుకున్నారు. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్ఠం	గరిష్ఠం
మొదటిరకం	రూ.160	రూ.200
రెండోరకం	రూ.90	రూ.158



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 176 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్ఠం	గరిష్ఠం
బైవోల్టిన్	473	566
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 565.82 కిలోలు

న్యూస్‌రీల్

తాడిపత్రి కోర్టు సివిల్ జడ్జిగా కురబలకోట వాసి


చంద్రశేఖర్ రెడ్డి

కురబలకోట: కురబలకోట మండలం అడవిపల్లెకు చెందిన ముదివేటి చంద్రశేఖర్ రెడ్డి అనంతపురం జిల్లా తాడిపత్రి కోర్టు జడ్జిగా నియమితులయ్యారు. ఈయన వివిధ కోర్టులలో స్టెనోగ్రాఫర్‌గా ఉండి జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. కురబలకోట మండలం నుంచి తొలి జడ్జిగా గుర్తింపు తెచ్చుకున్నారు. జడ్జి నియామకాలకు ఏపీ హైకోర్టు నోటిఫికేషన్ జారీ చేయడంతో జూనియర్ సివిల్ జడ్జిగా ఇటీవల ఎంపికయ్యారు. తాడిపత్రి కోర్టు జడ్జిగా బాధ్యతలు/ స్వీకరించారు.

ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డును పరిశీలించిన డీపీఓ


ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డును పరిశీలిస్తున్న డీపీఓ ధనలక్ష్మి

చిన్నమండెం : మండల పరిధిలోని వండాడి గ్రామంలో గల ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డును జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె షెడ్డును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. అలాగే వండాడి గ్రామ పంచాయతీలో జరుగుతున్న స్వమిత్వ సర్వే మ్యాప్స్‌ను పరిశీలించి సర్వే త్వరగా పూర్తి చేయాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. ఈమె వెంట పలువురు మండల స్థాయి అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఏప్రిల్ వరకు మమ్మల్ని తొలగించే అర్హత లేదు


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ అన్నమయ్య జిల్లా శాఖ అధ్యక్షుడు అలీఖాన్

కడప ఎడ్యుకేషన్ : జిల్లా శాఖకు సమాచారం లేకుండా రాష్ట్ర శాఖ కొత్త కమిటీని ఎన్నుకున్నట్లు ప్రకటించడం నిబంధనలకు వ్యతిరేకమని ఏపీటీఎఫ్ అన్నమయ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అలీఖాన్, చెంగల్‌రెడ్డి అన్నారు. ఆదివారం కడప ఏపీటీఎఫ్ కార్యాలయంలో అన్నమయ్య, కడప జిల్లాల ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా శాఖకు సమాచారం లేకుండా కొత్త కమిటీని ఎన్నుకున్నట్లు రాష్ట్ర కమిటీ ప్రకటించడం సరికాదన్నారు. ఇది రాష్ట్ర శాఖ కక్ష సాధింపు చర్య అన్నారు. 2024 ఏప్రిల్ వరకు ఎన్నుకున్న తమను తొలగించే అర్హత ఎవరికీ లేదన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శేఖర్ బాబు మాట్లాడుతూ ఏకపక్షంగా అన్నమయ్య జిల్లాశాఖను రాష్ట్రశాఖ తొలగించడం అన్యాయమన్నారు. సత్వరం రాష్ట్రశాఖ జరిగిన తప్పును సరిదిద్దుకోవాలని అన్నారు. లేకపోతే సంఘం ప్రతిష్ఠ దిగజారిపోతుందన్నారు. ఏపీటీఎఫ్ కడప జిల్లా అసోసియేట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వరచంద్ర, సీవీ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రశాఖ ఏపీటీఎఫ్‌ను రాజకీయ పార్టీగా మార్చుతోందన్నారు. మధ్యంతర కౌన్సిల్ పేరుతో జిల్లా కమిటీలను తొలగించుటకు రాష్ట్ర శాఖ పథక రచన చేయడం దారుణం అన్నారు. న్యాయపోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రతినిధులు ఉమాకాంత్, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేడే పోలింగ్

- జిల్లాలో పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు
- 81 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసిన అధికారులు
- పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేకంగా సీసీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్‌తో ప్రత్యేక పర్యవేక్షణ
- పోలింగ్ దృష్ట్యా భారీ బందోబస్తు
- కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది, బ్యాలెట్ బాక్సులు


విధి నిర్వహణలో సిబ్బంది నిమగ్నం



సాక్షి రాయచోటి : అన్నమయ్య జిల్లాలో శాసనమండలి ఎన్నికల పోలింగ్‌కు సమయం ఆసన్నమైంది. గత నెల రోజులకుపైగా అభ్యర్థులు, పార్టీల నేతలు ముమ్మరంగా ప్రచార పర్వంలో మునిగిపోయారు. జిల్లాకు సంబంధించి ఒక వైపు పశ్చిమ, మరోవైపు తూర్పు రాయలసీమ నియోజకవర్గానికి సంబంధించి పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎన్నికలు జరుగుతున్నాయి. అందుకు సంబంధించి సోమవారం పోలింగ్ నిర్వహణకు అధికార యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టింది. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. జిల్లా యంత్రాంగం పోలింగ్ బూత్‌లు మొదలుకొని సీసీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్ ద్వారా ప్రత్యేక పర్యవేక్షణ చేస్తోంది.

జిల్లాలో 48,322 పట్టభద్రులు, ఉపాధ్యాయ ఓటర్లు

జిల్లా వ్యాప్తంగా పశ్చిమ, తూర్పు రాయలసీమ నియోజకవర్గాల్లో పట్టభద్రులు 44,432, ఉపాధ్యాయులు 3890 మంది ఓటర్లు ఉన్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులకు కలిపి పశ్చిమ రాయలసీమ నియోజకవర్గంలో 37 పోలింగ్ బూత్‌లతోపాటు తూర్పు రాయలసీమ నియోజకవర్గంలో 44 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. అన్నమయ్య జిల్లాలో తూర్పు, పశ్చిమ రాయలసీమ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి తంబళ్లపల్లె, పీలేరు, మదనపల్లె, రాజంపేట, రైల్వేకోడూరులలో ఓటర్లకోసం పోలింగ్ బూత్‌లు ఉన్నాయి.


బ్యాలెట్ పత్రాలు వేసే బాక్సులను తరలిస్తున్న దృశ్యం

ఏర్పాట్లు పూర్తి.. భారీ బందోబస్తు

జిల్లాలో శాసనమండలి ఎన్నికలకు సంబంధించి జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, జేసీ తమీమ్ అన్సారియాలు ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షిస్తూ ప్రశాంత పోలింగ్‌కు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో పోలింగ్ కేంద్రాలకు ఇప్పటికే బ్యాలెట్ బాక్సులు చేరగా, అధికారులు, సిబ్బంది కూడా తమకు కేటాయించిన స్థానాలకు చేరుకున్నారు. పోలీసు యంత్రాంగం భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. ఎక్కడా కూడా అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఓటర్లు ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ తెలియజేస్తున్నారు.

పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా పట్టభద్రులు, ఉపాధ్యాయ ఓటర్ల వివరాలు

పట్టభద్రుల ఓటర్లు		
పురుషులు	:	14016
మహిళలు	:	6572
ట్రాన్స్‌జెండర్స్	:	06
మొత్తం	:	20,594
ఉపాధ్యాయ ఓటర్లు		
పురుషులు	:	1326
మహిళలు	:	632
మొత్తం	:	1958
పశ్చిమ రాయలసీమకు సంబంధించి పోలింగ్ బూత్‌ల వివరాలు		
పట్టభద్రులు	:	22
ఉపాధ్యాయులు	:	15
మొత్తం	:	37

తూర్పు రాయలసీమ ఎమ్మెల్సీకి సంబంధించిన వివరాలు

పట్టభద్రుల ఓటర్లు		
పురుషులు	:	15498
మహిళలు	:	8337
ట్రాన్స్‌జెండర్స్	:	03
మొత్తం	:	23,838
ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించిన వివరాలు		
పురుషులు	:	1180
మహిళలు	:	752
మొత్తం	:	1932
తూర్పు రాయలసీమకు సంబంధించి పోలింగ్ బూత్‌ల వివరాలు		
పట్టభద్రులు	:	29
ఉపాధ్యాయులు	:	15
మొత్తం	:	44
తూర్పు, పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఓటర్ల వివరాలు		
పట్టభద్రులు	:	44,432
ఉపాధ్యాయులు	:	3890
మొత్తం	:	48,322



ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించాలి

జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా


ఎన్నికల నిర్వహణపై అధికారులకు సూచనలు చేస్తున్న జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా

రాయచోటి: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా పీఓలు, ఏపీఓలకు సూచించారు. ఆదివారం రాయచోటి డివిజన్‌కు సంబంధించి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సరళిలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలింగ్ సిబ్బంది కృషి చేయాలన్నారు. ఈ ఎన్నికలను ప్రతి ఒక్కరూ ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఆర్డీఓ రంగస్వామి పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తు: ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



రాయచోటి : పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు చర్యలు తీసుకున్నామని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. సోమవారం గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తీసుకున్న భద్రతా ఏర్పాట్ల గురించి జిల్లా ఎస్పీ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఎమ్మెల్సీ పోలింగ్‌కు సుమారు 923 మంది పోలీసులచే బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోలింగ్ ప్రారంభం నుంచి ముగిసే వరకు ప్రశాంతంగా ముగిసేలా పటిష్ట చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా ఓటర్లు ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలోని ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద అవసరమైన మేర పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లాలో 81 పోలింగ్ స్టేషన్లు, 31 పోలింగ్ లొకేషన్లు, 15 రూట్ మొబైళ్లు, 12 స్ట్రైకింగ్ ఫోర్సు, మూడు స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, 30 ఫ్లైయింగ్ స్క్వాడ్స్, 30 ఎంసీసీ బృందాలు, 14 పికెట్స్‌లను ఏర్పాటు చేశామన్నారు. అలాగే జిల్లా ఎస్పీ సారథ్యంలో ఒక అదనపు ఎస్పీ, నలుగురు డీఎస్పీలు, 15 మంది సీఐలు, 50 మంది ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు/హెడ్ కానిస్టేబుళ్లు-185, కానిస్టేబుళ్లు-517, హోంగార్డులు-151 అలాగే ఒక ప్లటూన్ ఏపీఎస్పీ సిబ్బంది బందోబస్తులో వినియోగిస్తున్నామని ఎస్పీ వివరించారు.

ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం

- జిల్లాలో అన్నిచోట్ల సంబరాలు నిర్వహించిన పార్టీ శ్రేణులు
- వాల్మీకిపురంలో పార్టీ జెండా ఎగురవేసిన ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి
- రైల్వేకోడూరులో కొరముట్ల, రాజంపేటలో మేడా, మదనపల్లెలో నవాజ్‌బాషా ఆధ్వర్యంలో వేడుకలు
- మిగతా నియోజకవర్గాల్లో కేక్ కట్ చేసిన పార్టీ నేతలు


వాల్మీకిపురంలోకేక్ కట్ చేస్తున్న ఎంపి మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

సాక్షి, రాయచోటి : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పురుడు పోసుకుని 12 ఏళ్లు దాటి విజయవంతంగా 13వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా పార్టీ శ్రేణులు, నేతలు ఎక్కడికక్కడ సంబరాలు చేసుకున్నారు. అన్నమయ్య జిల్లా పీలేరు నియోజకవర్గంలోని వాల్మీకిపురం బస్టాండు సమీపంలో వైఎస్సార్ విగ్రహం వద్ద రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం పార్టీ కార్యకర్తలు, అభిమానుల సంబరాల మధ్య కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

జెండా ఎగురవేసిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యేలు

వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ దిగ్విజయంగా ముందుకు సాగాలని, మరో దశాబ్ద కాలం పాటు పేద ప్రజలకు సేవలు అందించేలా ప్రభుత్వం మరోమారు అధికారంలోకి రావాలని కోరుతూ ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో రైల్వేకోడూరులోని పార్టీ కార్యాలయం వద్ద జెండా ఎగురవేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. మదనపల్లె పార్టీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే నవాజ్‌బాషా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేసి కేక్ కట్ చేశారు. రాజంపేటలో ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి తన కార్యాలయం వద్ద జెండాను ఎగురవేసి కేక్ కట్ చేశారు. జై వైఎస్ జగన్, జై వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అంటూ నినాదాలతో హోరెత్తించారు. అదేవిధంగా రాయచోటిలోని పార్టీ కార్యాలయం వద్ద మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, మైనార్టీ సీనియర్ నాయకులు హబీబ్‌ఖాన్, బేపారి అహ్మద్‌లు జెండా ఎగురవేసి కేక్ కట్ చేశారు. పీలేరు నియోజకవర్గంతోపాటు తంబళ్లపల్లె నియోజకవర్గంలోనూ పార్టీ ఆవిర్భావం సందర్భంగా శ్రేణులు సంబరాల్లో మునిగిపోయాయి.

17న చలో అసెంబ్లీ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 17న చలో అసెంబ్లీ చేపడుతున్నట్లు ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలితమ్మ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని హోచిమన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. పెరిగిన ధరలకు అనుగుణంగా అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు.

నోరుపారేసుకుంటే లీడర్ కాలేవు లోకేష్

- పాపాల ట్రేడ్‌మార్క్ చంద్రబాబుదే
- ధైర్యవంతులైన నేతలు ఎన్టీఆర్, జగన్
- హెరిటేజ్ కోసం డెయిరీలు మూయించింది మీరు కాదా
- వచ్చే ఎన్నికల్లో చిత్తూరు నుంచి పోటీ చేయాలి
- అభివృద్ధిపై టీవీల్లో చర్చకు సిద్ధం
- లోకేష్‌పై మండిపడిన వైఎస్సార్‌సీపీ లోక్‌సభాపక్ష నేత మిథున్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యేలు చింతల రామచంద్రారెడ్డి, పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, నవాజ్‌బాషా, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప

బి.కొత్తకోట/తంబళ్లపల్లె: చిన్నా, పెద్ద లేకుండా, తన తండ్రి వయసు కలిగిన వ్యక్తిమీద, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపైనా నోరు పారేసుకుంటే నాయకుడు కాలేవని టీడీపీ నాయకుడు నారా లోకేష్‌కు వైఎస్సార్ సీపీ లోక్‌సభాపక్ష నేత పీవీ.మిథున్‌రెడ్డి హితవు పలికారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నాలుగేళ్లలో అభివృద్ధి జరగలేదని అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లెలో చర్చకు సిద్ధమని లోకేష్ ప్రకటించగా ఆ సవాల్ స్వీకరించిన మిథున్‌రెడ్డి ఆదివారం చర్చకు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా తంబళ్లపల్లెలో ఆయన మీడియాతో మాట్లాడుతూ లోకేష్ మాట్లాడుతున్న భాషను ప్రజలు హర్షించరన్నారు. హుందాగా మాట్లాడటంలో ఎన్టీఆర్, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసి నేర్చుకోవాలన్నారు. ధైర్యవంతులైన ఈ నేతలు ఎంత ఒత్తిడిలో ఉన్నా ఏనాడూ మాట జారలేదన్నారు. ఎవరికి భయం ఉందో వాళ్లు తాము ధైర్యవంతులమని నిరూపించుకునేందుకు దిగజారి మాట్లాడుతున్నారని లోకేష్‌ను విమర్శించారు. పాపాల ట్రేడ్ మార్క్ చంద్రబాబుదే అన్నారు. పాపాల అంటూ తనను, తండ్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని విమర్శించడం తగదన్నారు. చంద్రబాబు వెన్నుపోటుదారుడు, ఔరంగజేబుకంటే నీచమైన వ్యక్తి అని ఎన్టీఆర్ చెప్పిన వీడియోలు చూడాలని లోకేష్‌ను కోరారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక, కరోనా ఇబ్బందుల్లోనూ ఉమ్మడి చిత్తూరు జిల్లా అభివృద్ధికి బాటలు వేశారన్నారు. పరిశ్రమలపై విమర్శలు చేస్తున్న లోకేష్‌కు హెరిటేజ్ కోసం ప్రభుత్వ డెయిరీలను మూయించలేదా, చక్కెర కర్మాగారాలు మూతపడింది మీ ప్రభుత్వంలో కాదా అని ప్రశ్నించారు. న్యూట్రల్ టీవీ చానల్‌లో చర్చకు వస్తా, ప్రతి పని, జరిగిన అభివృద్ధిపై చర్చించేందుకు సిద్ధమని అన్నారు. . తంబళ్లపల్లెలో ప్రశాంతతకు భంగం వాటిల్లేలా లోకేష్ వాఖ్యలు చేస్తున్నట్టు చెప్పారు. చిత్తూరు జిల్లా పరువు కాపాడేలా లోకేష్ ఈ జిల్లాలో ఎన్నికల్లో పోటీ చేయాలని కోరారు. ఇకనైనా చవకబారు ప్రచారం మాని 2019లో ఎందుకు ఓటమిపాలయ్యారో గ్రహించాలన్నారు. ఇష్టమొచ్చినట్టు మాట్లాడితే ప్రజలు ఓట్లు వేస్తారని అనుకుంటే 2019 కంటే ఘోరమైన పరిస్థితి వస్తుందన్నారు.

- చిత్తూరు పార్లమెంటు సభ్యుడు రెడ్డెప్ప మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో పోటీ చేయకుంటే చంద్రబాబు, లోకేష్‌లకు పరువు దక్కుతుందని లేకుంటే ఓటమితో పరువు పోవడం ఖాయమన్నారు. కుప్పం ప్రజలు 35 ఏళ్లుగా గెలిపిస్తుంటే 35 మందికి ఉపాధి కల్పించే పరిశ్రమను ఏర్పాటు చేయని చంద్రబాబు ఉన్న పరిశ్రమలను మూసేశారన్నారు. కుప్పం ప్రజలకు తాగునీళ్లను ఇవ్వలేదన్నారు.

పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ సీఎంని సైకో అనడం, వ్యక్తిగత దూషణలు చేయడం తాత ఎన్టీఆర్ వారసత్వమా అని లోకేష్‌ను ప్రశ్నించారు. జగన్ పాదయాత్రతో లోకేష్‌కు పోలికే లేదన్నారు. తంబళలపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవర్గంలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధి ఏ స్థాయిలో ఉందో ప్రజలు చూస్తున్నారన్నారు. 75 ఏళ్లలో జరగని అభివృద్ధి నాలుగేళ్లలో జరిగిందని, ఇది సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతోనే సాధ్యమైందన్నారు. ఈ సమావేశంలో మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్‌బాషా, చిత్తూరు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఏపీఎండీసీ చైర్‌పర్సన్ జి.షమీం అస్లాం, నియోజకవర్గ పరిశీలకుడు ఇరగం సుబ్బారెడ్డి, మదనపల్లె మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా చలపతి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కొండా సిద్దార్థ, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాగొండ ఖలీల్, ప్రధాన కార్యదర్శి ఆముదాల మధుసూదన్ రెడ్డి, ఎంపీపీలు సాయిలీల, లక్ష్మీనరసమ్మ, మహమూద్, పూర్ణచంద్రిక, అనసూయమ్మ, జెడ్పీటీసీలు రామచంద్ర, శివన్న, మోహన్‌రెడ్డి, బైసాని జ్యోతి, పీరమ్మ, వాటర్ పవర్ టెక్ ఎండీ బి.పద్మనాభరెడ్డి, నాయకులు ఫీరోజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

వెటరన్ టీ-20 చాంపియన్‌గా 'అనంత' జట్టు


విజేతగా నిలిచిన అనంతపురం జట్టు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి- ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన ధనుంజయరెడ్డి మెమోరియల్ వెటరన్ టీ-20 క్రికెట్ టోర్నమెంట్ చాంపియన్‌గా అనంతపురం జట్టు నిలిచింది. ఆదివారం నిర్వహించిన ఫైనల్‌మ్యాచ్‌లో అనంతపురం, హైదరాబాద్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన హైదరాబాద్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 206 పరుగులు చేసింది. జట్టులోని ప్రదీప్ 100, షాబుద్దీన్ 62 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ జట్టు 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 196 పరుగులు మాత్రమే చేయగలిగింది. జట్టులోని చంద్రశేఖర్ 74, శ్రీధర్‌శర్మ 47 పరుగులు చేశారు. అనంతపురం బౌలర్ ఇనాయతుల్లా 2 వికెట్లు తీశాడు. దీంతో అనంతపురం జట్టు 10 పరుగుల తేడాతో విజయం సాధించింది. విజేతలుగా నిలిచిన జట్లకు క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్‌ఆర్ డిస్ట్రిక్ట్ అధ్యక్షుడు ఎం. భరత్‌రెడ్డి ట్రోఫీలను, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో క్రికెట్ సంఘం కార్యదర్శి ఎ. రెడ్డిప్రసాద్, సౌత్‌జోన్ కన్వీనర్ పి. సంజయ్‌కుమార్‌రెడ్డి, సభ్యులు మునికుమార్‌రెడ్డి, అబ్దుల్ రెహమాన్, విష్ణుమోహన్‌రావు, కరుణాకర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, అశ్విన్‌కుమార్‌రాజు, శివప్రసాద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నివాళి



నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని పోట్లదుర్తి గ్రామానికి చెందిన టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు చింతకుంట సత్యనారాయణ నాయుడు(77) అనారోగ్యంతో బాధపడుతూ గత బుధవారం మృతి చెందాడు. అదివారం జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి పోట్లదుర్తిలోని సత్యనారాయణ నివాసం వద్దకు వచ్చాడు.సత్యనారాయణ నాయుడు చిత్ర పటానికి నివాలర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఉద్యావన శాఖ రాష్ట్ర ప్రధాన సలహాదారుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళలపై దాడి: ఒకరికి గాయాలు

బి.కొత్తకోట : కూలిపనులకు వెళ్తున్న మహిళలపై జరిగిన దాడిలో ఒకరికి గాయాలైనట్లు హెడ్‌కానిస్టేబుల్ రవీంద్రనాయక్ ఆదివారం తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు..బి.కొత్తకోట నగర పంచాయతీ ఆలేటిపల్లెకు చెందిన సుధామణి, నాగమ్మ, సునందమ్మ, మరికొందరు ఉదయం కూలిపనులకు పోతుండగా ఇదే గ్రామానికి చెందిన గోపాల్, రాధమ్మ, వెంకటసుబ్బమ్మలు దారిలో నడవడ కూడదని అభ్యంతరం చెప్పారు. దీంతో ఘర్షణ జరిగింది. సుగధామణిపై రాయితో దాడి చేయడంతో గాయపడింది. మరో ఇద్దరికి కూడా గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రాజంపేట.. గుత్తోళ్లకు బాట!

- పొట్టచేతపట్టుకుని వలసవచ్చిన నిరుపేదకూలీలు
- నాలుగుదశాబ్దాల కిందట ప్రారంభం
- రాజంపేటతో విడదీయరానిబంధం



కూలికోసం పట్టణ ప్రధాన రహదారిలో వేచి ఉన్న గుత్తోళ్లు (ఫైల్)

రాజంపేట : అన్నమయ్య జిల్లా రాజంపేట నుంచి పేదలు జీవనోపాధి కోసం ఏడారి దేశాలకు వెళుతుంటే.. గుత్తి పరిసరాల ప్రాంతాల నుంచి ఇక్కడికి నిరుపేద కూలీలు తరలివస్తున్నారు. ఈ ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకొని తమ జీవనప్రయాణం సాగిస్తున్నారు. పొట్టచేతపట్టుకొని వలసవచ్చిన వారు ఇప్పుడు తమ జీవితాలను బాగుపరుచుకున్నారు.రాజంపేటతో విడదీయరాని బంధం ఏర్పరుచుకున్నారు.

2 వేలమందికిపైగా..

దాదాపు 2వేలమందికిపైగా కర్నూలు, అనంతపురం జిల్లాల పరిధిలోని పలు తాండాలు, దళిత,బలహీనవర్గాల నివాసాల నుంచి రాజంపేటకు తరలివచ్చారు. వివిధ రకాల పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. కుటుంబాలకు కుటుంబాలు ఇక్కడ స్థిరపడిపోయారు. రాజంపేటకు గుత్తోళ్ల రావడం నాలుగుదశాబ్దాల కిందట ప్రారంభమైంది. దీంతోఈ ప్రాంతానికి విడదీయరానిబంధం నెలకొనింది. పక్కజిల్లాల నుంచి వచ్చే నిరుపేద కూలీలకు కేరాఫ్ మారిపోయింది. వందలాది కుటుంబాల సంతతి ఇక్కడే పుట్టి, ఇక్కడే స్థిరపడిన పరిస్థితులకు దారితీసింది. కొందరికి ఇంటిపట్టాలు ఇవ్వడం, వారికి ఇక్కడే ఓటు హక్కు, రేషన్‌కార్డు లాంటి సౌకర్యాలను ప్రభుత్వం నుంచి లబ్ధిపొందుతున్నారు. దివంగత సీఎం వైఎస్‌రాజశేఖరెడ్డి పాలనలో ఈ పరిస్థితులు ఉండేవి. ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో కూడా స్వంతింటి కలనేరవేర్చుకుంటున్నారు. నవరత్నాలపథకాలతో గుత్తోళ్ల కుటుంబాలు లబ్ధిపొందుతున్నాయి. కొన్ని వారల్లో వీరు ఓటు బ్యాంకును శాసించే స్థాయికి చేరుకున్నారంటే రాజంపేటలో వీరి ప్రాబల్యం ఎలా ఉందో అవగతమవుతోంది.

ఏ పనికైనా వారే..

రాజంపేట పరిసర ప్రాంతాల్లో స్థానిక కూలీలకు డిమాండ్ ఉండేది. గుత్తోళ్ల ప్రస్థానం మొదలైనప్పటి నుంచి ఈ డిమాండ్ పడిపోయింది. ఏ పనికైనా వారే ముందుంటారు.రాజంపేట,ఒంటిమిట్ట,రైల్వేకోడూరు వరకు భవన నిర్మాణరంగం పనులకు వారిని పిలుపిస్తుంటారు.

గుత్తోళ్లు అని ఎందుకంటారంటే..

కర్నూలు, అనంతపురం జిల్లాలోని ప్యాపిలి, కోవెలకుంట్ల, పత్తికొండ, సుగ్గలి. గుత్తి , డోన్ పరిసరాల ప్రాంతాలకు చెందిన అనేక మంది పేద కూలీలు ఒకప్పుడు గుత్తి రైల్వేస్టేషన్‌కు వచ్చి రాజంపేటకు చేరుకొనేవారు..ఇది 40 ఏళ్ల కిందటి మాట. అప్పటి నుంచి పైన చెప్పిన ప్రాంతాల నుంచి, ఇతర ప్రాంతాల నుంచి వచ్చినా గుత్తోళ్లుగానే చెప్పుకుంటూ వచ్చారు. ఆ విధంగా గుత్తోళ్లు అని పేరు స్థిర పడిపోయింది.

ఎక్కడెక్కడ ఉంటారు

పట్టణంలో ప్రధానంగా రామ్‌నగర్, ఎన్‌టీఆర్‌నగర్, బోయపాళెం, బసినాయుడుగారిపల్లె, ఉస్మాన్‌నగర్ బైపాస్‌తోపాటు పలు వార్డుల్లోని ఖాళీ ప్రదేశాల్లో వీరు తాత్కాలిక గుడారాలు వేసుకున్నారు. రామ్‌నగర్‌లో చాలామంది ఇప్పటికే సొంతిళ్లు నిర్మించుకుని స్థిరపడిన వారు ఉన్నారు.

పేద కూలీలకు అండగా ప్రభుత్వం



రాజంపేటలో వలస కార్మికులకు (గుత్తోళ్లు) ప్రభుత్వం అండగా నిలిచింది. వారికి మహానేత వైఎస్‌రాజశేఖరరెడ్డి, ప్రస్తుత సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఇంటి స్థలాలు కేటాయించారు. వారికి పలు పథకాల వల్ల లబ్ధి కలుగుతోంది.రోజంతా కష్టపడి తమ కుటుంబాలను బాగుపరుచుకుంటున్నారు. అన్ని రంగాల్లో కూలీ పనులకు వీరినే పిలుస్తుంటారు.

-జె.కృష్ణారావుయాదవ్,
పట్టణ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ, రాజంపేట

కష్టించి పని చేస్తారు



కర్నూలు, అనంతపురం జిల్లాల్లోని మారుమూల గ్రామాలకు చెందిన తాండాల నుంచి అనేకమంది రాజంపేటలో జీవనం సాగిస్తున్నారు. వీరు 2వేలకుపైగా ఉన్నారు. వీరు కష్టపడే మనస్తత్వం కలిగి ఉంటారు. అందువల్ల అన్ని పనులకు వీరిని పిలుస్తారు.

- నల్లబోతుల ధర్మన్న,
కూలీల ప్రతినిధి, రాజంపేట

మూడేళ్ల వయస్సులో వచ్చా..



నేను మూడేళ్ల వయస్సులో రాజంపేటకు వచ్చాను. అప్పటి నుంచి కుటుంబసభ్యులందరం ఇక్కడే స్థిరపడిపోయాం. రాజంపేట వాసులు మనసున్న మారాజులు. కష్టాల్లో వచ్చిన వారికి అండగా నిలిచారు. దీంతో ఒకప్పుడు పదుల సంఖ్యలో ఉండేవారు ఇప్పుడు వేలసంఖ్యలో ఉన్నారు. మేము ఇప్పటికీ రాజంపేట వాసులే అనుకుంటున్నాము.

-పత్తికొండ రాఘవేంద్ర, కూలీ, రాజంపేట

రూ. 300 కోసం హత్య



భీమిశెట్టి లక్ష్మీనరసింహులు మృతదేహం

సిద్దవటం : చెట్లు కొట్టినందుకు డబ్బు చెల్లించే విషయపై జరిగిన ఘర్షణలో భీమిశెట్టి లక్ష్మీనరసింహులు (28) అనే వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన ఆదివారం ఉప్పరపల్లె గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ తులసీ నాగప్రసాద్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దవటం మండలం ఉప్పరపల్లె గ్రామానికి చెందిన భీమిశెట్టి లక్ష్మీనరసింహులు మాధవరం-1 గ్రామంలోని పెద్దమ్మ లక్ష్మమ్మ ఇంటో చెట్లు కొట్టించేందుకు ఇదే గ్రామంలోని ఎస్‌కేఆర్ నగర్ ఎస్సీ కాలనీకి చెందిన పత్తూరు శ్రీనివాసులుతో రూ. 600 కూలి ఇచ్చే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నాడు. శ్రీనివాసులుకు రూ.600 చెల్లించాడు. మరో రూ. 300 ఇవ్వాలని శ్రీనివాసులు డిమాండ్ చేశాడు.ఈ విషయమై ఆదివారం ఉప్పరపల్లెకు వెళ్లి లక్ష్మీనరసింహులుతో వాగ్వాదానికి దిగాడు. ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. భీమిశెట్టి లక్ష్మీనరసింహులుపై పత్తూరు శ్రీనివాసులు, మునీంద్ర, నాగేంద్రలు రాడ్లతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. గాయపడిన వ్యక్తిని వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతదేహానికి పోస్టు మార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పజెప్పినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తిపై పోలీసుల దాడి అమానుషం



బాధితుడితో మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం నేతలు

కడప అర్బన్ : అన్నమయ్య జిల్లా నందలూరుకు చెందిన ముమ్మడి అవినాష్‌రెడ్డి (30)పై ఈనెల 9వ తేదీ రాత్రి 9:20 గంటలకు రాజంపేట పోలీసులు విచక్షణారహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరచడం అమానుషమని ఆంధ్రప్రదేశ్ పౌరహక్కులసంఘం రాష్ట్ర సహాయకార్యదర్శి సి. వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షుడు పి. రెడ్డెయ్యలు పేర్కొన్నారు. ఆదివారం వారు కడప రిమ్స్‌లో తీవ్రగాయాలతో చికిత్సపొందుతున్న బాధితుడిని కలిసి పరామర్శించి, వివరాలను సేకరించారు. అనంతరం మాట్లాడుతూ ఈనెల 9వ తేదీన రాత్రి బాధితుడు ముమ్మడి అవినాష్‌రెడ్డి రాజంపేటలో వ్యక్తిగత పనులను ముగించుకుని తిరిగి నందలూరుకు వెళుతున్న సమయంలో బైపాస్ రోడ్డులో ఇద్దరు పోలీసులు ఆపారు. మోటార్‌బైక్ తాళాలు ఇవ్వాలన్నారు. ఎందుకు సార్ అడుగగా, మాకే ఎదురుచెపుతావా అన్నారు. తరువాత బైక్ తాళాలైనా ఇవ్వు.. లేదంటే తమకు మద్యం తెచ్చి ఇవ్వు అని అతనిని గద్దించారన్నారు. మరో ప్రైవేటు వ్యక్తితో కలిసి ఇద్దరు కానిస్టేబుళ్లు విచక్షణా రహితంగా వీపు, కాళ్లు, తొడలపైనా కట్టెతో కొట్టారని బాధితుడు పౌరహక్కులసంఘం నేతలకు తెలియజేశారు. సంఘటన జరిగిన సమయంలో గాయపడిన అవినాష్‌రెడ్డి, స్థానికుల సహాయంతో 108 అంబులెన్స్‌లో రాజంపేట ఏరియా ఆసుపత్రికి వెళ్లాడు. అక్కడ వైద్యులు ఎంఎల్‌సీ (మెడికో లీగల్ కేసు) కింద నమోదు చేసి పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు స్పందించలేదన్నారు. ఈనెల 10వ తేదీన కడపలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో చికిత్సకోసం చేరాడు. పోలీసులు ఎవరూ విచారించకపోగా, పోలీసులపై దాడి చేశారని బాధితుడిపైనే హత్యాయత్నం కేసు నమోదు చేయడం అన్యాయమన్నారు. జిల్లా ఉన్నతాధికారులు ఈ సంఘటనపై విచారణ చేయలన్నారు. బాధితుడికి చట్టపరంగా న్యాయం జరిగేలా చూడాలని వారు డిమాండ్ చేశారు.

గంగమ్మా.. దీవించమ్మా..



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట - బుగ్గలేటిపల్లి సమీపంలో వెలసిన గంగమ్మ జాతరకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.జాతర వారాల్లో భాగంగా మూడోఆదివారం అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తెల్లవారు జామున 3 గంటల నుంచి బారులు తీరారు. అలాగే ఆలయ ఆవరణలోని వీరభద్ర స్వామి, అంజనేయ స్వామి, సాయిబాబాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ ఈవో సురేష్ కుమార్ ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నదానం, మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని దాతలు చేపట్టారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీకేదిన్నె ఎస్ఐ బి. అరుణ్‌రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.

విద్యార్థిని ఆత్మహత్య



బత్తల సిరి (ఫైల్)

చింతకొమ్మదిన్నె : మండలంలోని లక్ష్మీనారాయణపురం గ్రామానికి చెందిన బత్తల సిరి అనే విద్యార్థిని ఆదివారం ఆత్మహత్యకు పాల్పడింది. చింతకొమ్మదిన్నె ఎస్ఐ బి.అరుణ్‌రెడ్డి కథనం మేరకు మండలంలోని జె.కొత్తపల్లె పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న బత్తల సిరి గ్రామంలో సహచర పిల్లలతో ఆడుకుంటూ గొడవ పడటంతో ఇంట్లో వాళ్లు మందలించారు. మనస్తానికి గురైన సిరి ఆదివారం మధ్యాహ్నం ఇంటిలో ఎవరూ లేని సమయంలో చీరతో ఫ్యానుకు ఉరి వేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందిందని ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

అవమానభారంతో ఎంపీటీసీ భర్త ఆత్మహత్యాయత్నం

ఎక్సైజ్ సీఐ తప్పుడు కేసు బనాయించారని మనస్తాపం



జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కృష్ణ, పక్కనే ఎంపీటీసీ మమత

మదనపల్లె : చేయని నేరానికి తమపై కేసు నమోదుచేసి గ్రామంలో అవమానపరచారని మనస్తాపంతో చీకలబైలు వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ మమత భర్త కృష్ణ(30) ఆదివారం సాయంత్రం ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన సోదరుడు సురేంద్ర మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో అపస్మారకస్థితిలో ఆయన చికిత్స పొందుతున్నాడు. ఈ సందర్భంగా కృష్ణ భార్య వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ మమత మాట్లాడుతూ.. చీకలబైలులో తమ పొలం వద్దకు భార్యాభర్తలు పశువులను తోలుకెళుతుండగా గ్రామానికి చెందిన రాజేష్ తమ పొలంలో నుంచి వస్తుండగా చూశామన్నారు. తర్వాత కొంతసేపటికి ఎస్‌ఈబీ బార్డర్ సీఐ వెంకటలక్ష్మి, సిబ్బంది శేఖర్, ప్రభాకర్‌తో కలిసి పొలంలో దాడులు నిర్వహించారు. మూడు కేసుల కర్ణాటక మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. తమపై కేసు నమోదుచేస్తున్నట్లు చెప్పారు. తాము మద్యం తీసుకురాలేదని, కొద్దిసేపటి క్రితం గ్రామానికి చెందిన రాజేష్ పొలంలో నుంచి రావడం గమనించామని, అతడు తీసుకుని వచ్చి ఉంటాడని చెప్పినా ఎక్సైజ్ పోలీసులు వినలేదన్నారు. మొండివైఖరితో తమనే నిందితులుగా చేస్తూ కేసు నమోదుచేశారన్నారు. దీంతో తమ కుటుంబసభ్యులు రాజేష్ వద్దకు వెళ్లి విచారిస్తే అతడు నేరం అంగీకరించి పోలీసుల వద్ద సరెండర్ అయ్యేందుకు వెళ్లాడు. అయినా సీఐ వెంకటలక్ష్మి ఒప్పుకోకపోగా, తామే నేరం చేసినట్లు పరుషంగా మాట్లాడిందన్నారు. చేయని నేరాన్ని తామే చేశామని ఒప్పుకోవాల్సిందిగా బెదిరించి తప్పుడు కేసు బనాయించారు. దీంతో ప్రజాప్రతినిధి భర్తగా తప్పుడు కేసును భరించలేక, అవమానాన్ని తట్టుకోలేక మనస్తాపంతో పురుగుల మందు తాగాడని ఎంపీటీసీ తెలిపింది. ఎస్‌ఈబీ పోలీసు ఉన్నతాధికారులు చీకలబైలు బార్డర్ చెక్‌పోస్ట్ సీఐ వెంకటలక్ష్మిపై తక్షణమే చర్యలు తీసుకుని, తమపై అక్రమంగా బనాయించిన కేసును ఉపసంహరించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై సీఐ వెంకటలక్ష్మిని వివరణ కోరగా... ఎంపీటీసీ మమత భర్త కృష్ణ, అతడి సోదరుడు సురేంద్ర ర్యెగులర్‌గా కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తీసుకువచ్చి వ్యాపారం చేస్తుంటారన్నారు. సురేంద్రపై గతంలో రెండుకేసులు ఉన్నాయన్నారు. విధి నిర్వహణలో భాగంగా కేసు నమోదుచేయడం జరిగిందే తప్ప ఉద్దేశపూర్వకంగా చేయలేదని తెలిపారు.

ద్విచక్రవాహనాలు ఢీ : మహిళకు తీవ్రగాయాలు



గాయపడిన యశోద

పీలేరురూరల్ : రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో మహిళ తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం స్థానిక చిత్తూరు రోడ్డు మార్గంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఇందిరమ్మ కాలనీకి చెందిన యశోద (35) ద్విచక్రవాహనంలో పీలేరు పట్టణానికి బయలుదేరింది. పులిచెర్ల మండలం కల్లూరుకు చెందిన రవికుమార్ బైక్‌లో పీలేరు నుంచి స్వగ్రామానికి వెళుతున్నాడు. రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో యశోద తీవ్రంగా గాయపడగా, రవికుమార్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు.

కారు ఢీకొని..

కలకడ : చిత్తూరు-కర్నూలు జాతీయరహదారిపై కలకడ మండలం, కలకడ ఇందిరమ్మ కాలనీవద్ద ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఖాదర్‌వల్లి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు, 108 సిబ్బంది కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కలకడ టౌన్, రాజీవ్‌నగర్ కి చెందిన అబ్దుల్లా కుమారుడు ఖాదర్‌వల్లి ద్విచక్రవాహనంలో కలకడనుంచి ఇందిరమ్మ కాలనీ వైపు బయలుదేరాడు. అదే సమయంలో వేలూరు నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఖాదర్‌వల్లి తలకు, కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం 108లో పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైన చికిత్సకోసం తిరుపతికి తీసుకెళ్లారు.

ఆటోలో నుంచి కిందపడి..



గాయపడిన ఖగేష్

మదనపల్లె : ఆటోప్రమాదంలో బాలుడు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం మదనపల్లె మండలంలో జరిగింది. చీకలబైలు పంచాయతీ బార్లపల్లెకు చెందిన లక్ష్మీదేవి తన కుమారుడు బి.ఖగేష్ (8), కుమార్తెతో కలిసి వారంరోజుల క్రితం పుట్టింటికి వచ్చింది. తిరిగి మెట్టినిల్లు అయిన బి.కొత్తకోట మండలం మొగసాలమర్రికు సోదరుడు గోపితో కలిసి ఆటోలో బయలుదేరింది. వేంపల్లె క్రాస్‌వద్ద ఆర్టీసీ బస్సు వేగంగా ఆటోపై దూసుకురావడంతో బస్సును తప్పించేందుకు డ్రైవర్ వాహనాన్ని పక్కకు తిప్పాడు. ఆటోలో ఒకవైపుగా కూర్చున్న బాలుడు ఖగేష్ అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఆటోలో బాలుడిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

కారు ఢీకొని..

మదనపల్లె : కారు ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం పెద్దమండ్యం మండలంలో జరిగింది. కలిచెర్ల గ్రామం ఎర్రసానివారిపల్లెకు చెందిన వెంకటరమణ కుమారుడు ఎం.మల్లికార్జున (30) బెంగళూరులో కూలిపనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. శనివారం స్వగ్రామానికి వచ్చాడు. ఆదివారం మధ్యాహ్నం సొంతపనులపై ద్విచక్రవాహనంలో పెద్దమండ్యంకు బయలుదేరాడు. కలిచెర్ల సచివాలయం వద్ద వేగంగా వచ్చిన కారు బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో మల్లికార్జున తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు. పెద్దమండ్యం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.